క్లుప్తంగా

మురళీరాజును కలసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



ధర్మవరంలో మురళీరాజును కలసిన పార్టీ శ్రేణులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజును బుధవారం ఆ పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో మురళీరాజు ఇటీవల వైఎస్సార్ సీపీలో చేరారు. దీంతో నియోజకవర్గంలోని పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు ధర్మవరంలో ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణలకు ఏ కష్టం వచ్చిన తాను అండగా ఉంటానికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోన బాబ్జి, వై సత్యనారాయణ, దేవ లక్ష్మణ్, లొండ బాబు, దేవ వీరబాబు కె.యేసు బాబు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: రహదారుల నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలేశ్వరం నుంచి రమణయ్యపేట మీదుగా ఏజెన్సీకి వెళ్లే ప్రధాన రహదారి మరమ్మతుల నిమిత్తం ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ జరుగుతుందన్నారు. త్వరలోనే రహదారికి మరమ్మతు పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు, సూతి బూరయ్య, కొప్పుల బాబ్జీ, నూకతాటి ఈశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ సమ్మిట్‌లో పాల్గొన్న అన్నవరం దేవస్థానం ఉద్యోగులు

అన్నవరం: విజయవాడలో మంగళ, బుధవారాల్లో నిర్వహించిన అమరావతి డ్రోన్ సమ్మిట్ -2024కు అన్నవరం దేవస్థానం నుంచి ఎలక్ట్రికల్ డీఈ వి.సత్యనారాయణ, సిస్టమ్ అడ్మినిస్టేటర్ ఎల్.రమేష్ హాజరయ్యారు. సత్యదేవుని ఆలయానికి వేల సంఖ్యలో వచ్చే భక్తులకు డ్రోన్ల ద్వారా వివిధ సేవలు అందించేందుకు గల అవకాశాలు తెలుసుకునేందుకు గాను డ్రోన్ సిమ్మట్‌కు హాజరవ్వాలని దేవస్థానం ఈఓ కే రామచంద్రమోహన్ ఆదేశించారు. ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ నుంచి మొత్తం 11 మంది అధికారులు ఈ సమ్మిట్‌లో పాల్గొనగా వారిలో అన్నవరం దేవస్థానం నుంచి వీరిద్దరూ ఉన్నారు. కాగా ఈ సమ్మిట్‌లో వివిధ రకాల డ్రోన్లను ప్రదర్శించినట్టు తెలిపారు.

బెల్లపు ఊట ధ్వంసం

గండేపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో సారా బట్టీలపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో సారా కాస్తున్న కె.గోపాలపురానికి చెందిన బి.ముత్యాలును అరెస్టు చేసి, అతని నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. సారా తయారీకి సిద్ధం చేసిన 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి పెద్దాపురం కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు తెలిపారు. ఈ దాడుల్లో గండేపల్లి ఎస్సై యువి శివనాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసనలు



గుమ్మళ్లదొడ్డిలో నిరసన తెలుపుతున్న వారిని అడ్డుకుంటున్న పోలీసులు

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో అస్సాగో ఇథనాల్ ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తూ చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గ్రామస్తులకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, మరో నాయకుడు పాఠంశెట్టి సూర్యచంద్ర చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష రెండో రోజుకు చేరింది. బుధవారం స్థానిక మహిళలు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఫ్యాక్టరిని ముట్టడించే ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. శిబిరాన్ని జిల్లా కాలుష్య నివారణ బోర్డు ఇంజినీర్ రామచంద్రరావు, జిల్లా ఇంచార్జ్ పరిశ్రమల అధికారి పి.ప్రదీప్ కుమార్ సందర్శించారు. ఫ్యాక్టరీ కారణంగా గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని చెప్పారు.



ప్రమాదకరంగా ఉన్న ఉల్లిగోగుల రోడ్డు



ఇ.గోకవరం వద్ద ప్రమాదకరంగా ఉన్న సుబ్బారెడ్డి సాగర్ ఏటి కాలువ బ్రిడ్జి



నిరుపయోగంగా దర్శనమిస్తున్న సోలార్ సిస్టం

వసతులు నిల్.. సమస్యలు ఫుల్

- గిరిజన గ్రామాల్లో కనీస సౌకర్యాలు కరవు
- అధ్వానంగా రహదారులు
- తరచూ విద్యుత్ సమస్యలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలో గిరిజన గ్రామాలను సమస్యలు వీడటం లేదు. పలు గ్రామాల్లో రహదారులు పూర్తిగా ఛిద్రం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్దిపాలెం-ఇ.గోకవరం రహదారి అధ్వానంగా తయారైంది. రహదారిపై అడుగడుగునా భారీ గోతులు ఏర్పడటంతో అడుగుతీసి అడుగు వెయ్యలేని పరిస్థితి నెలకొంది. ఇక వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ఇ.గోకవరం నుంచి మెట్టచింత వెళ్లే వరకూ రహదారి కోతకు గురైంది. ఇక్కడ ఆదమరిచి ప్రయాణిస్తే ప్రాణాలు గాల్లో కలసిపోయే ప్రమాదం ఉంది.



చెరువును తలపిస్తున్న ఇ.గోకవరం-పెద్దిపాలెం రహదారి

మరమ్మతులకు నోచుకోని రోడ్లు

గ్రామాల్లో రహదారులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఏళ్ల గడుస్తున్నా కోతకు గురైన రహదారికి కనీసం మరమ్మతులు చేసేందుకు సైతం అధికారలు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. మెట్టచింత నుంచి ఉల్లిగోగులకు వెళ్లే మట్టి రోడ్డు అత్యంత ప్రమాదకంగా ఉంది. ఈ రహదారి పొడవునా భారీగా గోతులు ఏర్పడటంతో వర్షం పడితే బురదమయంగా మారుతోంది. ఈ రహదారిపై ప్రయాణించే వాహనాలు దిగబడిపోతున్నాయి. గిరిజనులు ఈ రహదారిపై వెళ్లేందుకు నరకయాతన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులను పునర్నిర్మించాలని గిరిజన ప్రజలు కోరుతున్నారు.

గిజనులకు అందని ప్రభుత్వ ఫలాలు

మండలంలోని చీమునురు, ఆర్లదార, గిరిజనాపురంలో గిరిజనులు జీవిస్తున్నారు. వీరికి కనీస మౌలిక వసతులు కరువయ్యాయి. ఇక్కడ జీవిస్తున్న గిరిజనులకు ప్రభుత్వ ఫలాలు అందని ద్రాక్షగానే మిగిలాయి. ఆయా గ్రామాల గిరిజనులు మైదాన ప్రాంతానికి వచ్చేందుకు రహదారి లేకపోవడంతో ఇన్నపాటి దారి మార్గంలో నడిచి వసున్నారు. తమకు కనీస వసతులు కల్పించాలని గిరిజన ప్రజలు కోరుతున్నారు.

తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలు, వైర్లు కారణంగా మెట్టచింత, ఉల్లిగోగుల గ్రామాల్లో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. ఇనుప విద్యుత్ స్తంభాలు తుప్పుపట్టి విరిగిపోతుండగా వైర్లు తరచూ తెగిపోతున్నాయి. దీంతో తరచూ విద్యుత్ సమస్య తలెత్తుతోంది. దశాబ్దాలుగా ఈ సమస్య కొనసాగుతోంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

రహదారి నిర్మించాలి



మా గ్రామానికి వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. మట్టి రోడ్డు కావడంతో వర్షం పడితే ప్రయాణించడం కష్టంగా ఉంటోంది. అధికారుల స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– అన్నిక సత్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు, ఇ.గోకవరం

కనీస వసతులు కల్పించాలి



మాది మారుమూల గిరిజన గ్రామం కావడంతో తాగునీరు, విద్య, రహదారి కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం. కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలు, వైర్ల కారణంగా తరచూ విద్యుత్ సమస్య తలెత్తుతోంది. విద్యుత్ అంతరాయం ఏర్పడితే రోజులు తరబడి చీకటిలోనే మగ్గుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీస వసతులు కల్పించాలి

– ఉల్లి సోమాలమ్మ, గిరిజన మహిళ, గిరిజనాపురం

రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం



జి.కొత్తపల్లిలో రైతుల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న డీటీ కిరణ్‌కుమార్

శంఖవరం: గ్రామాల్లో చేసిన భూముల రీ సర్వేతో రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతాయని డిప్యూటీ తహసీల్దార్ సలాది కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో బుధవారం రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. రైతుల నుంచి పలు వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల్లో సర్వే నంబర్లు తప్పు ఉన్న వాటిని రీ సర్వే ద్వారా పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. రైతుల భూమి ఆన్‌లైన్‌లో లేకపోతే ఆన్‌లైన్ చేస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న 18 రోజుల్లో భూ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కాగా రైతుల నుంచి 35 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈగల విజయదుర్గ, మాజీ జెడ్పీటీసీ ఈగల అప్పారావు, వీఆర్వో సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

శంఖవరం: మండలంలోని అచ్చింపేటలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు అండగా నిలిచారు. గ్రామంలో చింతపల్లి అప్పలరాజుకు చెందిన తాటాకిల్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. కాగా బుధవారం బాధిత కుటుంబాన్ని మురళీరాజు వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10 నగదు, 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు బొట్టా చైతన్య, ఈగల విజయదుర్గ, రామిశెట్టి ఏసుబాబు, సకుర గుర్రాజు, నరాల శ్రీను వైఎస్సార్ సీపీ నాయకుడు పల్లా అప్పలరాజు పాల్గొన్నారు.



అచ్చింపేటలో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

తుని: స్థానిక కొండవారిపేటకు చెందిన ఎంఆర్‌పీఎస్, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పట్టణ యువసేన కన్వీనర్ గుండుపల్లి సంహాచలం ఇటీవల మృతి చెందాడు. ఎంఆర్‌పీఎస్ ప్రతినిధులు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి కొంత ఆర్థిక సహాయం, 50 కేజీల బియ్యం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ సభ్యులు ముప్పిడి శ్యాంకుమార్, జుత్తుక మురళీ, గందం మహేష్, జుత్తుగ సంజయ్, కుందేటి జాన్, గెడ్డం వంశీ, కాకడ సాగర్, గందం రమేష్, మామిడి రాజా తదితరులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ కుటుంబానికి పరామర్శ



వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీనును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, వైఎస్సార్ సీపీ నేతలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను (బంకు శ్రీను) కుటుంబాన్ని బుధవారం ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ పరామర్శించారు. బంకు శ్రీను తండ్రి వీరరాఘవరావు ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తొలుత వీరరాఘవరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీభారతి విద్యాసంస్థల అధినేత సుంకర వీరబాబు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు రామిశెట్టి బులిరామకృష్ణ, బదిరెడ్డి గోవింద్, అడ్డతీగల జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు, పార్టీ నాయకులు గొల్లపల్లి దొరబాబు, పెదిరెడ్డి నానిబాబు, ఒమ్మి రమణ, బొడ్డు చిన్న, జక్కా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కాశీకావడి వీధి నాటకం



కాశీ కావడి నాటకంలోని ఓ సన్నివేశం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శ్రీగౌరీ శంకరుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక కళాకారులు కాశీకావడి వీధి నాటకాన్ని ప్రదర్శించారు. గ్రామంలోని నంది సెంటర్, సీతంపేట, రామారావుపేట, మంగయ్యమ్మపేట, సినిమా హాలు సెంటర్లలో నాటకాన్ని ప్రదర్శించాగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఈ నాటకంలో రామాహరిగా నానిపల్లి కృష్ణ, మొదటి భార్యగా కోనేటి బాబ్జి, రెండో భార్యగా సింగం ఈశ్వరరావు, కుమార్తెలుగా నానిపల్లి లోవరాజు, బొమ్మిడాల శ్రీనివాస్ నటించి మెప్పించారు. సీనియర్ కళాకారులు రాయి సుబ్బారావు, దాడి శ్రీను మేకప్-డ్రెసింగ్ చేశారు. తొలుత గౌరమ్మకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోటనందూరు: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై టి.రామకృష్ణ సూచించారు. స్థానిక మదర్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు బుధవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ మోసాలపై విద్యార్థులు అవగాహన పెంచుకొని ప్రజలను చైతన్య పరచాలన్నారు. ఫేక్ డిజిటల్ అరెస్టులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియాలో తెలియని వ్యక్తులు, ఆన్‌లైన్ రుణయాప్‌లు, గంజాయి వాడకం, రవాణ తదితర విషయాల్లో విద్యార్థులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై రామకృష్ణ

మా భవిష్యత్ ఏమిటో చెప్పండి ?

కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మహిళా పోలీసులు

గండేపల్లి/జగ్గంపేట: మా భవిష్యత్తు ఏమిటని గ్రామ/వార్డు సచివాలయ మహిళా పోలీసు అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమణి, జిల్లా అధ్యక్షురాలు వేణమ్మ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2019 డీఎస్సీ నోటిఫికేషన్‌లో పరీక్షలు రాసి ఉత్తీర్ణులై ఉద్యోగాలు సాధించినప్పటికీ మా భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సంబంధం లేని జాబ్ చార్ట్‌తో సతమతమవుతూ విధులు నిర్వహిస్తున్నామన్నారు. సెలవులు మంజూరు విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ కూటమి ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాబ్ చార్ట్, మదర్ డిపార్ట్‌మెంట్, ప్రమోషన్ ఛానల్ తదితర విషయాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి సత్వర పరిష్కారాన్ని చూపించాలని కోరారు.



నాగమణి



వేణమ్మ

కుమ్మరిలోవ నిర్వాసితులకు పరిహారం మంజూరు

తుని రూరల్: మండలంలోని కుమ్మరిలోవ కాలనీ నిర్వాసితులకు నష్టపరిహారం మంజూరైనట్టు ఎమ్మెల్సీ, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. తుని మండలం తేటగుంట క్యాంపు కార్యాలయంలో బుధవారం పెద్దాపురం ఆర్డీఓ రమణి, పోలవరం కుడికాలువ ఈఈ గోవిందు, రెవెన్యూ, సర్వేయర్లతో యనమల సమావేశమయ్యారు. ఎంతో కాలంగా 115 మందికి పరిహారం అందలేదన్నారు. ఆ మొత్తాన్ని ప్రభుత్వం మంజూరు చేసినట్టు తెలిపారు. ఒక్కొక్కరికి రూ.6.10 లక్షలు చొప్పున మంజూరు చేసినట్టు వివరించారు. దీంతో తుని తాండవ నదిపై నిర్మిస్తున్న ఆక్విడెక్టుకు అడంకులు తొలగిపోయినట్టు ఆయన పేర్కొన్నారు. రాజుపేటలో పేదల కాలనీకి సేకరించిన భూముల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ ప్రసాద్, సర్వేయర్ దేవుడు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యంతో మంచి ఫలితాలు

- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- గ్రామాల్లో జోరుగా పొలం పిలుస్తోంది కార్యక్రమాలు

కోటనందూరు: సాగులో మెరుగైన ఫలితాలు సాధించాలంటే ఎరువులు, పురుగుమందుల యాజమాన్యం కీలకమని మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కేపీ మల్లవరం, జగన్నాథపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు, పురుగు మందుల వినియోగిస్తే మెరుగైన దిగుబడులతో పాటు నిస్సారమైపోతున్న భూమిని రక్షించుకోవచ్చన్నారు. అనంతరం వరి, ఉద్యాన పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఏఈఓ శివకుమారి, రైతులు పాల్గొన్నారు.



గిడజాంలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు



హంసవరంలో డ్రోన్‌తో పురుగుల మందు పిచికారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

యాజమాన్య పద్ధతులు పాటించాలి

రౌతులపూడి: ఖరీఫ్ సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు తెలిపారు. మండలంలోని గిడజాంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. జీడిమామిడిలో టీ దోమ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉద్యానవనశాఖ అధికారి పి.అరుణ్‌కుమార్ వివరించారు. కొబ్బరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్‌తో మందుల పిచికారీ సురక్షితం

తుని రూరల్: వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం సురక్షితమని, డ్రోన్లతో పురుగుల మందులు పిచికారీ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.అశోక్ కుమార్ సూచించారు. మండలంలోని హంసవరం, హెచ్.కొత్తూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రోన్‌లు వినియోగంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. డ్రోన్‌లు వినియోగం వల్ల తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో సురక్షత పద్ధతిలో మందులు పిచికారీ చేసుకోవచ్చన్నారు. హంసవరం సర్పంచ్ రాయి మేరీఅవినాష్, ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి, వీఏఏలు రాజా, సుధీర్, రైతులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

కిర్లంపూడి: వరిలో వచ్చే తెగుళ్ల నివారణపై జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ హరి రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని సింహాద్రిపురంలో వ్యవసాదాధికారి జోకా అమృత ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరికి తెగుళ్ల బెడద ఎక్కువగా ఉందన్నారు. రైతులు పురుగు మందుల వాడకం తగ్గించి నాణ్యమైన అధిక దిగుబడులను సాధించాలని సూచించారు. అనంతరం రైతులకు మట్టి నమూనా పరీక్షల పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పీడీ వరప్రసాద్, సహాయ సంచాలకులు ఎస్.దైవ కుమార్, వ్యవసాయాధికారి సంజీవ్, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



కేపీ మల్లవరంలో ఉద్యానసాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

భక్తులకు సత్యదీక్ష కిట్ల పంపిణీ

కిర్లంపూడి: మండలంలోని పలు గ్రామాల్లో భక్తులకు బుధవారం ఉచితంగా సత్యదీక్ష వస్త్రాలు, సామగ్రి (కిట్లు) పంపిణీ చేశారు. కిర్లంపూడి, గెద్దనాపల్లి, బూరుగుపూడి గ్రామాల్లో సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు ఆధ్వర్యంలో సత్యదీక్షపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నవరం దేవస్థానం ఈఓ రామచంద్రమోహన్, చైర్మన్ ఐవీ రోహిత్ ఆదేశాల మేరకు వీరవెంకట సత్యనారాయణస్వామి దీక్షను ధరించే భక్తులకు ఉచితంగా దీక్షా వస్త్రాలు, పూజా పుస్తకం, స్వామివారి మాలలను భక్తులకు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పసుపులేటి అర్జున రావు, సంధకం సత్యకుమారి, మొగిలి కలశివ, సంక్రాంతి గోపాలకృష్ణ, బెల్లంకొండ గోవిందు, శెట్టి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

బెన్నబాబుకు గ్లోబల్ పీస్ అవార్డు



ఆర్‌ఎంపీ బెన్నబాబుకు అవార్డు అందజేసిన తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ప్రతినిధులు

అన్నవరం: స్థానిక ఆర్‌ఎంపీ పదిలం బెన్నబాబుకు హైదరాబాద్‌కు చెందిన తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ స్వచ్ఛంద సంస్థ మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డును ప్రదానం చేసింది. కాగా మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తాను ఈ పురస్కారం అందుకున్నట్టు బెన్నబాబు బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్, మాజీ ఎంపీ డాక్టర్ బండ్ల ప్రకాష్, ఎంఎల్‌సీ బుగ్గారపు దయానంద గుప్తా, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

కంబాల శ్రీనివాసరావుకు సత్కారం



కంబాల శ్రీనివాసరావును సత్కరించి జ్ఞాపికను అందజేస్తున్న దేవీచౌక్ ఆలయ కమిటీ సభ్యులు

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయం వద్ద నిర్వహించిన దసరా ఉత్సవాలకు రూ.8 లక్షల విరాళం ప్రకటించిన విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావును ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఘనంగా సత్కరించారు. స్థానిక సీఎండీకేఎస్‌పీవీ లేఅవుట్ వద్ద ఆయనను శాలువా, గజమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా రూ.3.50 లక్షల చెక్కును ఆయన కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో దాసరి తమ్మన్నదొర, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాధశర్మ, తదితరులు పాల్గొన్నారు.

రేపు మినీ జాబ్ మేళా

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ బాలరాజు తెలిపారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పది, ఇంటర్, ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన 19 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, ఇతర సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలతో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 86889 77277, 82477 88247 నంబర్లను సంప్రదించాలన్నారు.